

జిల్లాలో రేషన్ పంపిణీ సక్రమంగా అమలు చేయాలి

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజలకు నిత్యావసర వస్తువులు రేషన్ దుకాణాల ద్వారా సరుకులు సక్రమంగా అందించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తో కలసి పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎం డి యు వాహనాల ద్వారా ఇకపై రేషన్ పంపిణీ జరగదని రేషన్ దుకాణాల్లోనే డీలర్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సరుకులను డీలర్లు పంపిణీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ డీలర్ పై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో 1367 చౌక ధాన్యపు డిపోలు ఉన్నాయన్నారు. దీపం టు పథకం కింద మంజూరు అయ్యే గ్యాస్ వినియోగం పట్ల లబ్ధిదారులకు డీలర్లు అవగాహన కల్పించాలన్నారు. ప్రతినెల డీలర్లు ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. ధరల పట్టిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 65 ఏళ్ళు దాటిన వారికి, వికలాంగులకు వారి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఖచ్చితమైన తూకాలతో సరుకులు పంపిణీ చేయాలని, ఏ రోజుకు ఆ రోజు పంపిణీ చేసిన వివరాలను నోటీసు బోర్డు ద్వారా తెలపాలని ఆదేశించారు. సిఎస్‌డిటిలు రేషన్ షాపులను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ వంశీకృష్ణారెడ్డి, జిల్లాలోని సిఎస్‌డిటిలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి: ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. బస్సు సర్వీసులపై ఆర్టీసీ ఆర్ఎం మధుసూదన్‌ను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ లో మరుగుదొడ్ల స్థితిగతులు, పరిశుభ్రత, బస్టాండ్ కాంప్లెక్స్‌లోని హోటళ్లు, సమాచార కేంద్రం, రిజర్వేషన్ కౌంటర్ ద్వారా అందిస్తున్న సేవలు వాటి పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బస్టాండ్ లో ఉన్న ప్రయాణికులతో ఆర్టీసీ సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎం ఇనయతుల్లా, అసిస్టెంట్ మేనేజర్ హరిత, ఏవో ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికి...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనేక సమస్యలు జిల్లాలో తిష్ట వేసి ఉన్నాయి. వానాకాలమెచ్చినా రైతులకు విత్తనాలు ఎప్పుడు అందుతాయో తెలియని అయోమయం నెలకొంది. మరోవైపు సాగునీరు సక్రమంగా అందుతుందో లేదో అన్న సందేహాలు ఆయకట్టు రైతుల్లో ఉన్నాయి. వైద్యం సక్రమంగా అందటం లేదని అసంతృప్తి జనంలో స్పష్టంగా కనిపిస్తోంది. వీటి పరిష్కారంపై నేతలు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. నేతల దృష్టి అంతా స్థానిక సంస్థల్లో అధికార మార్పిడిపైనే ఎక్కువగా ఉందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని స్థానాలను దక్కించుకోగా, మరిన్ని దక్కించుకునే ప్రయత్నాలు జోరుగా నడుస్తున్నాయి. వీటి చుట్టూ రాజకీయాలుంటుండటంతో జనం ఇబ్బందులు గాలికి వదిలేసారన్న ఆరోపణలున్నాయి.

జనం ఇక్కట్లు

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి వారం రోజులు గడువుంది. సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు బాగా రావడంతో రైతులు దుక్కులు దున్నుకునే పనిలో ఉన్నారు. జూన్‌లో మంచి వర్షాలు పడితే విత్తనం కూడా విత్తుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రకృతి అనుకూలంగా ఉన్నా ప్రభుత్వపరంగా మాత్రం ఇంకా సమయత్తమవలేదు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే వేరుశనగ పంటకు అవసరమైన సబ్సిడీ విత్తనం పంపిణీ ఎప్పుడన్నది స్పష్టత లేదు. ఇవి పంపిణీ చేస్తే రైతులు వాటిని ఒలిచి విత్తనాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక సాగునీటికి సంబంధించి హంద్రీనీవా కాలువ వెడల్పుపైనున్న వేగం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ మరమ్మతులపై లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో వస్తున్నాయి. ఇవి పెరిగితే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు తీసుకునే అవకాశముంది. కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయి. నీరు ఎక్కువగా తీసుకునే పరిస్థితులు లేవు. వీటి పర్యవేక్షించేందు సూపరింటెండెంట్ ఇంజనీరు లేరు. అంతక మునుపు ఉన్న ఎస్ఇ రాజశేఖర్ ఉద్యోగ విరమణ చెందారు. ఇతోనే సాగునీటి నిర్వహణ చేపట్టడం ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇక వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందటం లేదన్న అసంతృప్తిని ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనే సభ్యులు వెల్లడించారు. పెద్దఎత్తున సమస్యలను లేవనెత్తారు.

అధికార మార్పిడిపైనే నేతల దృష్టి

జనం సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్ష పార్టీలు అధికార మార్పిడిపైనే దృష్టి సారించాయన్న విమర్శలున్నాయి. స్థానిక సంస్థల్లో అత్యధికంగా వైసిపి ఉండేది. వాటన్నింటినీ అధికార టిడిపి వైపు మార్చుకునే ప్రయత్నాల్లోనే ముఖ్య నేతలుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికే మడకశిర, హిందూపురం, కదిరి పురపాలక సంఘాల్లో మార్పులు జరిగాయి. రామగిరి మండల పరిషత్ మార్పు కోసం పెద్దఎత్తున వివాదం నడుస్తూనే ఉంది. వీటి నడుమే అనంతపురం నగర పాలక సంస్థలోనూ మార్పుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్న ప్రచారం నడుస్తోంది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ శుక్రవారం రోజు చేసిన ప్రకటన చర్చనీయాంశం అయింది. కడప మేయరు తరహాలోనే అవినీతి ఆరోపణల పేరుతో తొలగిస్తామని ప్రకటించడం గమనార్హం. అంతకు మునుపు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఛాంబరులోనూ , నగర మేయరు ఛాంబరుల్లోనూ ఫొటోల మార్పుపైనా పెద్ద చర్చ నడుస్తోంది. రాజకీయ పదవుల్లోనున్న వారి చాంబరుల్లో ఎవరి పొటోలుండాలన్నది నిర్ణయించడం సాధ్యమవుతుందా అన్న చర్చ రాజకీయాల్లోనూ ఉంటోంది.

ఆధిపత్యం కోసం ఇరుపార్టీల నాయకుల పోరు

స్థానిక సంస్థల కైవసంపైనే దృష్టి



మేయర్ వర్సెస్ అర్బన్ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర పాలకసంస్థ మేయర్ వసీం, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుధ్య వాహనాల ప్రారంభోత్సవ వేదిక సాక్షిగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ మేయర్ మహమ్మద్ వసీం సలీం ఒకరిపై మరొకరు వేరువేరుగా జరిగిన కార్యక్రమాలో పరస్పర విమర్శలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ పారిశుధ్య వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహమ్మద్ సలీం కలిసి డంపింగ్ యార్డ్‌లో 22 కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వీరి అవినీతి బాగోతం త్వరలో బయట పెడతానని ఎమ్మెల్యే ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు.. కూటమి అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే ప్రజలకు నగర అభివృద్ధిని చూపించామన్నారు. ఇదిజరిగిన తరువాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో వాహనాల పరిశీలన కార్యక్రమాన్ని మేయర్ మహమ్మద్ వసీం సలీం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. డంపింగ్ యార్డులో టెండర్ వర్క్ 22 కోట్లు కాగా రూ. 22 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు ఇటీవలనే రాజకీయాల్లోకి వచ్చిన ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకోకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అర్బన్ ఎమ్మెల్యే పార్ట్ టైం ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారన్నారు. ఒక్క రూపాయి నిధులు తీసుకురాకున్నా వైసీపీ హయాంలో మంజూరు అయిన పనులు, తమ పాలక వర్గం ఆమోదించిన పనులు ప్రారంభిస్తూ కూటమి పాలనలోనే నగరంలో అభివృద్ధి జరుగుతోందని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డంప్ యార్డ్‌లో మాజీ ఎమ్మెల్యే, తాను అవినీతికి పాల్పడినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతున్నారన్నారు. బిల్లులు చెల్లించిందే రూ.11 కోట్లు లోపు అయితే రూ.9 కోట్ల అవినీతికి ఆస్కారం ఎక్కడ ఉందని ప్రశ్నించారు.విచారణ తర్వాత బిల్లును చెల్లించాలని చెపుతున్న తాము అవినీతికి పాల్పడినట్లా, కాంట్రాక్టర్లకు అనుకూలంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అవినీతికి పాల్పడినట్లా అని ప్రశ్నించారు. ఇప్పటికే తాము అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. వారి ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా త్వరితగతిన విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ఏడాది పాలనలో అర్బన్ ఎమ్మెల్యే చేసిన అవినీతి, అక్రమాల చిట్టా తమ వద్ద ఉందని సందర్భం వచ్చినప్పుడు అన్ని బయట పెడతామని హెచ్చరించారు. పదే పదే తనను డమ్మీ మేయర్ అంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పార్ట్ టైం ఎమ్మెల్యే, డమ్మీ ఎమ్మెల్యే అని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన బెదిరింపులకు భయపడే వారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.

పరస్పర ఆరోపణలతో దుమ్మెత్తి పోసుకున్న మేయర్, ఎమ్మెల్యే

'పురం'లో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలో ప్రజలకు నాన్ జ్యుడీషియల్ స్టాంపులు కొరత ఏర్పడినట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వినియోగదారులు వాపోతున్నారు. ఇదే విషయమై రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, పలువురు వినియోగదారులు కలసి శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రర్లు శ్రీనివాసులు, భాగ్య శేఖర్ రెడ్డితో స్టాంపులు కొరత గురించి చర్చించారు. జిల్లా కేంద్రం నుంచి పెట్టిన ఇండెంట్ రాలేదని, ఇదివరలో వచ్చిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వినియోగదారులు ముందు జాగ్రత్తగా ఎక్కువ స్టాంపులు తీసుకొని నిలువ చేసుకోవడంతో ప్రస్తుతం ఈ డిమాండ్ ఏర్పడిందని చెప్పారు. ఎక్కువగా స్టాంపులను ముందుగా భద్రపరచుకోవడం వల్ల ఈ డిమాండ్ ఏర్పడినట్లు సబ్ రిజిస్ట్రర్లు తెలిపారని రియల్ ఎస్టేట్ వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి తెలిపారు.



సబ్ రిజిస్టర్‌ను కలవడానికి వచ్చిన వ్యాపారులు

క్రీడల్లో మెళకువలు నేర్చుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

యువకులు ఆసక్తి ఉన్న క్రీడల్లో మెళకువలు నేర్చుకొని రాణించాలని మాజీ మున్సిపల్ చైర్మన్, శ్రీ సత్య సాయి జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు జేవి అనిల్ కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆర్డీటీ సౌజన్యంతో హిందూపురం ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్ బాల్ గ్రాస్ రూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూపురం పట్టణంలో ఫుట్‌బాల్ క్రీడపై యువకులు, చిన్నారులు ఎంతో ఆసక్తి చూపుతున్నారన్నారు. అందుకు అనుగుణంగానే తమ అసోసియేషన్ తో పాటు ఆర్డీటీ కూడా ఎంతో సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కోశాధికారి ఎస్ .శేఖర్, కార్యదర్శి బికె. మహమ్మద్ సలీం, కార్యవర్గ సభ్యులు విజయ వాణి, పీడీలు బి.ఎ. లోకనాథ్, విజయభాస్కర్, హిందూపురం హిందూపూర్ సౌత్ యునైటెడ్ క్లబ్ ల నుండి 80 మంది క్రీడాకారులు 10 మంది కోచ్ లు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా మహానాడును విజయవంతం చేయండి :మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జిల్లా మహానాడు ను విజయవంతం చేద్దామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మునిసిపల్ చైర్ పర్సన్ డిఈ రమేష్ కుమార్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పుట్టపర్తి లో శనివారం జరుగు జిల్లా మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఈ నెల 27, 28 ,29 వ తేదీలలో కడపలో జరగబోవు మహానాడు కార్యక్రమానికి గ్రామాలు, వార్డుల నుండి పెద్ద ఎత్తున మహానాడు కార్యక్రమాన్ని నాయకులందరూ కలిసి విజయవంతం చేయాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ జెవిఎస్ అనిల్ కుమార్, కౌన్సిలర్లు ఇర్షాద్ అహమ్మద్, రహమత్ బీ, నాగమణి, రాష్ట్ర వాల్మీకి కార్పోరేషన్ డైరెక్టర్ బీవనహళ్లి ఆనంద్, రాష్ట్ర కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ పరిమళ, రామాంజినమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు ఆర్.ఎమ్.ఎస్. షఫీ, అమరనాథ్, ఆదినారాయణ, ప్రెస్ వెంకటేష్, అంజాద్, జయప్ప, అజ్మతుల్లా, సర్పంచ్ లు మంజునాథ్, కొండూరు సిద్దు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ క్రిష్టప్ప, మాజీ సర్పంచ్ రాము, ఐటీడీపీ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, టీడీపీ నాయకులు హరీశ్, నాగేంద్ర, అమీన్, అశోక్, రవీంద్ర, ప్రసాద్, మహిళా నాయకురాలు వెంకటలక్ష్మి, శ్రీదేవి, చిన్నమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓపన్ వెయిటింగ్ హాల్ పైకప్పు పడి బాలుడు మృతి

ప్రజాశక్తి గుంతకల్లు

గుంతకల్లు రైల్వే స్టేషన్ లో ఏడవ నెంబర్ ప్లాట్‌ఫాంలో ఓపన్ వెయిటింగ్ హాల్‌లో నిద్రిస్తున్న ఎనిమిదేళ్ల బాలుడుపై పైకప్పు పడటంతో మృతిచెందాడు. శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఈఘటనకు సంబందించిన వివరాలు...కర్నూలు ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు శ్రావణి దంపతులు తమ ఎనిమిదేళ్ల కుమారుడు మణికంఠతో కలిసి దైవ దర్శనానికి రామేశ్వరం వెళ్లడానికి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు గురువారం సాయంత్రం వచ్చారు. తాము వెళ్లే రైలు శుక్రవారం ఉండడంతో ఆ రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ లోని ఏడవ నెంబర్ ప్లాట్ ఫారంలోని ఓపెన్ వెయిటింగ్ హాలులో నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున వెయిటింగ్ హాలు పైకప్పు మణికంఠ అనే బాలుడిపై పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని అతని తల్లితండ్రులు వెంటనే సమీపంలోని రైల్వే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే వారు కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో వారు మణికంఠను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు.అక్కడ ఆ బాలుడికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు వెళ్ళాలని వైద్యులు సూచించారు.వెంటనే ఆ దంపతులు తమ ఎనిమిదేళ్ల కుమారుణ్ణి అంబులెన్సులో కర్నూలులోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆ బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ కుమారుడు మృతిచెందాడని మృతుడి తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బాలుడి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలి:సిపిఎం

రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం – 7లో నిద్రపోతున్న ప్రయాణికుడైన బాలుడు మణికంఠపై సిమెంట్ పెంకులు పడి మరణించడం బాధాకరమని ఆ బాలుడి కుటుంబ సభ్యులకు రూ. 50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు రైల్వే స్టేషన్లో శుక్రవారం బాలుడిపై పెచ్చులు పడిన ప్రాంతాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వే స్టేషన్లో ఏడవ నెంబర్ ప్లాట్ ఫాంలో ప్రమాదం జరిగి బాలుడు మతి చెందాక ఆ ప్రదేశంలో అధికారులు తమ తప్పుని కప్పు పుచ్చుకోవడానికి యుద్ధ ప్రాతిపదికన దాన్ని మరమ్మతులు చేశారన్నారు. నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులపై రైల్వే ఉన్నత అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకొని మృతిచెందిన బాలుడు కుటుంబానికి రూ. 50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని అలాగే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబానికి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, కమిటీ సభ్యులు తిమ్మప్ప, రాము,బుజ్జి,వంశీ,కర్ణ,రాజు తదితరులు పాల్గొన్నారు.



మృతిచెందిన బాలుడు మణికంఠ



బాలుడు మణికంఠపై పడిన సిమెంటు పెచ్చు

ఇష్టారాజ్యం...

◆ పేరుకే 'అఫిషియల్ క్లబ్'..పెత్తనం అంతా రాజకీయనాయకులదే..
◆ అఫిషియల్ క్లబ్‌లో నిబంధనలు గాలికి...
◆ రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో క్లబ్ అద్దె భవనాలు
◆ లక్షలాది రూపాయలు దుర్వినియోగం



కళావిహీనంగా మారిన స్టేజీ

ప్రజాశక్తి-పెనుకొండ

అఫిషియల్ క్లబ్ పేరు చెబితే..అందరికీ అధికారులు గుర్తుకొస్తారు. సబ్ కలెక్టర్ గౌరవాధ్యక్షులుగా, డిఎస్పీ గౌరవ ఉపాధ్యక్షులుగా ఉంటారని, అక్కడ అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన వారు హుందాగా కాలక్షేపం చేస్తుంటారని భావిస్తారు. అయితే అందుకు విరుద్ధంగా ఇక్కడి పరిస్థితి ఉంది.రాజకీయ నాయకుల జోక్యం పెరిగిపోయి క్లబ్ వివాదాలలో చిక్కుకుంది. సబ్ కలెక్టర్, డిఎస్పీ ఆధ్వర్యంలో ఉండాల్సిన ఈ అఫిషియల్ క్లబ్..కొందరి చేతుల్లోకి వెళ్లిపోయింది. పేరుకే అఫిషియల్ క్లబ్.. అక్కడ నిబంధనలేవీ అమలు కావు. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులు, సమాజంలో హుందాగా ఉండే వారికి సభ్యత్వం ఇవ్వాలి. అలాంటి వారికి కాలక్షేప కేంద్రంగా దీనిని నిర్వహించాలి. గతంలో పేకాట నిర్వహణకు, మద్యం తాగేందుకు, రాజకీయ నాయకులకు విడిది కేంద్రగా మారిందన్న ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో క్లబ్‌లో పేకాట, మద్యం తాగుతున్నారనే కారణంతో పోలీసులు క్లబ్‌కు తాళం వేశారు. క్లబ్ గురించి ఎన్ని విమర్శలు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఇక్కడి అద్దె దుకాణాల వ్యవహారంలో లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయినట్లు వెలుగులోకి వచ్చింది. అధికార, ప్రతిపక్షపార్టీ నాయకులు అద్దె భవనాల పేరుతో కోట్ల రూపాయల విలువ చేసి స్థలాలను చేజిక్కించుకున్నట్లు ఆరోపణలున్నాయి.

నిబంధనలు గాలికి...

సభ్యులకు మాత్రమే క్లబ్‌లోకి ప్రవేశం ఉండాలి. నలుగురు ఉద్యోగులు సభ్యులుగా చేరితే ఒక ప్రజాప్రతినిధికి సభ్యత్వం ఇవ్వాలని నిబంధనఉంది. ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు కంటే రాజకీయనాయకులు, ఇతరులే అధికంగా సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు 78 మంది, ఇతరులు 70 మంది ఉన్నట్లు క్లబ్ నిర్వహకులు పేర్కొంటున్నారు.

అద్దె దుకాణాల్లోనే మతలబు...

క్లబ్‌కు ప్రధాన ఆదాయం అద్దె దుకాణాల నుంచి వస్తుంది. క్లబ్‌కు సబంధించిన పాత దుకాణాలు 16, నూతనంగా నిర్మించినవి 23 దుకాణాలున్నాయి. క్లబ్ స్థలంలో దుకాణం నిర్మించుకోవాలంటే సభ్యులై ఉండాలి. ఒక దుకాణం నిర్మాణం చేసేందుకు క్లబ్‌కు రూ.50 వేలు అడ్వాన్స్ చెల్లించాలి. సొంత నిధులతో దుకాణం నిర్మించుకోవాలి. అందుకు ప్రతిఫలంగా 9ఏళ్లు దుకాణానికి అద్దె చెల్లించాల్సిన అవసరం ఉండదు. గడువు తీరిన తర్వాత క్లబ్ నిబంధనలకు ప్రకారం ప్రతినెల అద్దె చెల్లించాలని స్టాంప్ పేపరుపై అగ్రిమెంట్ రాసుకుంటారు. రాజకీయ నాయకులు క్లబ్‌లోకి ప్రవేశించిన తర్వాత ఈ నిబంధనలకు తూట్లు పొడిచారు. ఇష్టారాజ్యంగా దుకాణాలు నిర్మించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరికొందరు ఇతరులకు అధిక అద్దెకు ఇచ్చారు.

గడువు తీరినా అద్దె చెల్లించని వైనం...

క్లబ్ నిబంధనల ప్రకారం గడువు పూర్తి అయినప్పటి నుంచి నెలనెలా అద్దె చెల్లించాలి. గడువు తీరిన దుకాణ సముదాయలు 16 దుకాణలున్నాయి. వీటికి నెలనెలా అద్దె చెల్లించకుండా దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. పట్టణంలో దుకాణాలకు డిమాండ్ ఉంది. ప్రధాన కూడళ్లల్లో దుకాణాలకు నెలకు రూ. 15 వేల నుంచి రూ.20 వేలు అద్దె చెల్లిస్తున్నారు. క్లబ్ దుకాణాలు కూడా ఇదే అద్దె వచ్చే అవకాశం ఉంది. అయితే ఒక్కొక్క దుకాణానికి రూ. 25,00నుంచి 3వేల రూపాయలు మాత్రమే అద్దె చెల్లిస్తున్నట్లు క్లబ్ నిర్వహకులు తెలిపారు. అది కూడా సక్రమంగా చెల్లించకుండా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నారు. రాజకీయ నాయకుల జోక్యంతో క్లబ్‌కు ఆదాయం రావడం లేదు.

రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో క్లబ్ అద్దె భవనాలు

అఫిషియల్ క్లబ్ దుకాణాలు రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో ఉన్నాయి. 39 దుకాణాలుంటే దాదాపు 35 దుకాణాలు రాజకీయ నాయకుల చేతుల్లో ఉన్నాయి. కొందరు హోటళ్లు,చిల్లర దుకాణాలు నిర్వహించుంటు జీవనం సాగిస్తున్నారు. నాయకులు మాత్రం దుకాణాలను అధిక అద్దెలకు ఇచ్చారు.

లక్షలాది రూపాయలు దుర్వినియోగం?

క్లబ్‌కు దుకాణాలు, అడ్వాన్స్‌ల రూపంలో ప్రధాన ఆదాయం వస్తుంది. అద్దెలరూపంలో లక్షల్లో ఆదాయం సమకూతుంది. ఈ వ్యహారంలో లక్షలాది రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలున్నాయి. క్లబ్‌లో పని చేసే బాయ్స్‌కు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారు. ఏళ్లుగా పాతుకు పోయిన క్లబ్ కమిటీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



క్లబ్‌లో మూతబడిన భవనం

పూర్వ వైభవం వచ్చేనా?

అఫిషియల్ క్లబ్‌కు గతంలో మంచి పేరుండేది. ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు క్లబ్ నిర్వహణలో చొరవ చూపేవారు.ప్రతి ఏటా ఉచిత ఆరోగ్య శిబిరాలు, కంటి వైద్యం, కల్చరల్ ప్రోగ్రాంలు, చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సహకాలు వంటి కార్యక్రమాలు నిర్వహించే వారు. ఏళ్లు గడుస్తున్న గతంలో నిర్వహించిన కార్యక్రమాలు ఒక్కటంటే ఒక్కటి చేపట్టలేదు. కేవలం రాజకీయ నాయకులకు విడిది కేంద్రంగా అఫిషియల్ క్లబ్ మారిపోయింది.

నూతన పాలకమండలి అభివృద్ధి చేస్తుందా?

ఆరేళ్ల తర్వాత క్లబ్‌కు నూతన పాలకమండలి ఏర్పాటైంది. ఈ కమిటీ సభ్యులైనా క్లబ్ అభివృద్ధికి పాటుపడుతారా? అన్న చర్చలు సాగుతున్నాయి. పెనుకొండకే తలమానికంగా ఉన్న అఫిషియల్ క్లబ్‌లో గతంలో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి సైతం సభ్యులుగా ఉన్నారు. ఆయన హయాంలో క్లబ్ ఒక వెలుగు వెలిగింది. రాను రాను మసకబారిపోయింది. ఆయన వారసురాలు మంత్రి సవిత అఫిషియల్ క్లబ్ పై దృష్టి సారించి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొత్తగా ఎన్నికైన సభ్యులు క్లబ్ ఆస్తులు పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

సమర్థవంతమైన పాలకమండలి లేకపోవడంతోనే ...



అఫిషియల్ క్లబ్ పై అవగాహన లేని సమర్థవంతమైన పాలకమండలి లేకపోవడం వల్లేనే క్లబ్ మసకబారిపోయింది. క్లబ్ విధివిధానాలపై అవగాహన ఉన్న వారైతే క్లబ్‌కు పూర్వవైభవం సంతరించుకుంటుంది. నూతన కమిటీ ఆదిశగా అడుగులు వేసి అఫిషియల్ క్లబ్‌ను అభివృద్ధి చేయాలి. క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు తిరిగి ప్రారంభించాలి.

జాన్‌ప్రియనాథ్,
అఫిషియల్ క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి
www.prajasakti.com

కరోనాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి



ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కరోనా పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందాలని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆమె ప్రజలకు పలు విషయాలు తెలిపారు. జన సమూహం, గుంపులు గుంపులుగా ఉండే ప్రదేశంలో తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. శుభకార్యాలు, సమావేశాలు, పార్టీలు సాధ్యమైనంత వరకూ తగ్గించుకుంటూ కరోనా నిబంధనలు పాటించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్ట్ తదితర ప్రదేశాల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. 60 ఏళ్లు పైబడిన వారు, గర్భిణులు ఇంట్లోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో బయటకు రాకూడదని తెలిపారు. తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరం, గొంతు నొప్పి, రుచి, వాసన తెలియకపోవడం, దగ్గు, ఒళ్లు నొప్పులు, ముక్కు దిబ్బడ, వాంతులు కావడం కరోనా లక్షణాలు అన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందేందుకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశామన్నారు. కరోనా నిబంధనలు పాటిస్తే ఎటువంటి అనారోగ్యాలు రావని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం అన్నారు. కరోనా విషయంలో ప్రజలు భయాందోళన చెందవద్దని, నిబంధనలు పాటించాలన్నారు. అనారోగ్యంగా ఉన్నవారు బయట తిరిగితే సులభంగా కరోనా బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తెలిపిన మేరకు ప్రజలు కరోనా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వాటిపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.


'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

'ఉపాధి' కూలీలకు తక్షణమే బకాయి వేతనాలు, పనిముట్లు ఇవ్వాలని వ్యవసాయ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మండలంలోని గుడిపల్లి గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి కూలీల సమస్యలు, ఉపాధి హామీ చట్టం అమలుపై ఆరా తీశారు. కూలీలు మాట్లాడుతూ 8 వారాల నుంచి వేతనాలు అందలేదని, పే స్లిప్పులు ఇవ్వలేదని, బెడ్ నుంచి సమ్మర్ అలవెన్స్, నీరు, మజ్జిగ, గడ్డపార పదును బిల్లులు, పనిముట్లు, మెడికల్ కిట్లు ఇవ్వలేదన్నారు. ప్రమాద బీమా ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని పేదలు, వ్యవసాయ కూలీలకు దూరం చేసే కుట్రలు చేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ చట్టం అమలు, స్వల సాధన కోసం కూలీలు సంఘంగా ఏర్పడి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి కూలీ సభ్యత్వం తీసుకుని సంఘంలో సభ్యులుగా చేరాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26వ తేదీ గ్రామ సచివాలయం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో కూలీలు పాల్గొనాలని కోరారు.

రిజర్వాయర్ వద్దు

గ్రామంలో రిజర్వాయర్ నిర్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, రిజర్వాయర్ వల్ల సర్వస్వం కోల్పోయి రోడ్డున పడతామని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. గుడిపల్లి గ్రామంలోని చిన్న, సన్న కారు రైతులు పరిశ్రమల కోసం భూములు ఇచ్చారని, అయితే కూటమి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజలను దగా చేస్తోందని విమర్శించారు. వందల కుటుంబాలకు నష్టం చేసే రిజర్వాయర్ రద్దుకు మంత్రి సవిత ప్రత్యేక చొరవ చూపి గుడిపల్లి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. బలవంతంగా రిజర్వాయర్‌కు ఆదేశిస్తే పార్టీలకతీతంగా గ్రామంలోని ప్రజలను పెద్దఎత్తున సమీకరించి నిరసన పోరాటాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.


పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

యోగా దినచర్యలో భాగం కావాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


యోగాసనాలు వేస్తున్న ఎస్పీ రత్న

ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని ఎస్పీ వి.రత్న సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో యోగా గురువు అందరితో యోగాసనాలు వేయించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో ఎంతో ఒత్తిడికి గురవుతుంటారని, ఆ ఒత్తిడి నుంచి పూర్తిగా ఉపశమనం పొందాలంటే యోగా ఎంతో ముఖ్యం అన్నారు. మనం క్రమం తప్పకుండా తీసుకునే ఆహారం లాగానే యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. మనిషి క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల భవిష్యత్తులో చాలా ఉపయోగాలు ఉంటాయని, ఆరోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చు అన్నారు. జూన్ 21వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో యోగా గురువు, డీఎస్పీలు విజయకుమార్, ఆదినారాయణ, శిక్షణ డీఎస్పీ ఉదయ పావని, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, సిఐలు సునీత, నరేందర్‌రెడ్డి, బొజ్జప్ప, ప్రవీణ్ కుమార్, ఆర్ఐలు వలి, మహేష్, ఎస్ఐలు లింగన్న, మల్లికార్జునరెడ్డి, కృష్ణమూర్తి, ఎఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ రాధిక

కిశోరి బాలికలకు అవగాహన

ప్రజాశక్తి తలుపుల

కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తలుపుల కోట 3వ అంగన్వాడీ కేంద్రంలో కిశోరి బాలికలకు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కదిరి ప్రాజెక్టు సిడిపిఒ రాధిక హాజరై మాట్లాడారు. 11-18 ఏళ్ల లోపు బాలికలకు ఉన్నత విద్య, నైపుణ్యతపై అవగాహన కల్పించారు. చదువుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ దీప, తేజశ్రీ, అంగన్వాడీ కార్యకర్త సుశీల, తదితరులు పాల్గొన్నారు.

'పది' ఫిజికల్ సైన్స్ పరీక్షకు 79.70 శాతం హాజరు

ప్రజాశక్తి-కొత్తచెరువు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు 79.70 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని డిఇఒ జి.కృష్ణప్ప, తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 34 పరీక్ష కేంద్రాల్లో 3,468 మందికి 2,764 మంది హాజరుకాగా 704 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. అలాగే ఆపాస్ పదో తరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 7 కేంద్రాల్లో నిర్వహించగా 303 మందికి 252 మంది(83.17శాతం) హాజరు కాగా 51 మంది గైర్హాజరయ్యారు. ఆపాస్ ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లావ్యాప్తంగా 4 కేంద్రాల్లో నిర్వహించగా 126 మందికి 112 మంది(88.89 శాతం) హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నటరాజు తెలిపారు. ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు. సమావేశంలో మండలంలోని వివిధ సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-మడకశిర

ఉగ్రవాదం నిర్మూలనకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో సైన్యానికి మద్దతుగా శుక్రవారం పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బిజెపి నాయకులు, ప్రజలు, మాజీ సైనికులు జాతీయజెండాలు చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ స్థానిక వాల్మీకి సర్కిల్ వద్ద ప్రారంభమై పట్టణ వీధుల గుండా సాగి అంబేద్కర్ సర్కిల్ వద్ద ముగిసింది. అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో 30 మంది మాజీ సైనికులు, నలుగురు మాజీ సైనికుల భార్యలు ప్రజలు పాల్గొన్నారు. అనంతరం పురుషోత్తం ఆధ్వర్యంలో 30 మంది మాజీ సైనికులను సన్మానించారు. కార్యక్రమంలో ఉమేష్ చంద్ర, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్ర పాల్గొన్నారు.

జిల్లా మహానాడుకు తరలివెళ్దాం

ప్రజాశక్తి-మడకశిర

పుట్టపర్తి పట్టణ సమీపంలోని మామిళ్ల కుంట క్రాస్ వద్ద శనివారం నిర్వహిస్తున్న టిడిపి జిల్లా స్థాయి మినీ మహానాడుకు నియోజకవర్గం నుంచి టిడిపి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలని మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్, కుమారస్వామి, మద్దనకుంటప్ప, దాసిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి ఆధ్వర్యంలో పుట్టపర్తికి తరలివెళ్దామని వారు తెలిపారు.

టిడిపి నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర

పట్టణానికి చెందిన టిడిపి నాయకులు మార్కెట్ బాబు కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో ఐసియు వార్డులో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలియడంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆసుపత్రికి వెళ్లి మార్కెట్ బాబును పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

టిడిపికి కార్యకర్తలే బలం

మినీ మహానాడులో పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ఆయువు అని నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. యుద్ధం తప్పదన్నప్పుడు అరచేయి కూడా ఆయుధంగా మారుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. పచ్చ కండువా అంటే వ్యసనం అని.. దానిని ఒక్కసారి పట్టుకుంటే వదల్లేని బంధం ఏర్పడుతుందన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న మారుతి రాఘవేంద్రస్వామి కళ్యాణ మండపం లో శుక్రవారం శ్రీరామ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి టిడిపి మినీ మహానాడు అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప హాజరయ్యారు. ముందుగా వారు పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీగా మహానాడు వేదిక వద్దకు చేరుకున్నారు. అక్కడ అభిమానులు పరిటాల శ్రీరామ్‌కు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ఎన్టీఆర్, పరిటాల రవి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇటీవల ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకులు, పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. శ్రీరామ్ మాట్లాడుతూ మనం ధర్మవరం ఎమ్మెల్యే అవ్వాలని పోరాడలేదని.. వైసిపి నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలన్న ఉద్దేశ్యంతోనే పని చేశామన్నారు. నా కోసం పని చేసిన వారెవర్నీ మర్చిపోలేదని, అందరికీ అండగా ఉంటానన్నారు. వైసిపి నాయకులు అభివృద్ధి విషయంలో సలహాలు ఇస్తే తీసుకుంటాం కానీ ఇష్టమొచ్చినట్టు చేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కడపలో జరిగే మహానాడుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు అంజినప్ప మాట్లాడుతూ ధర్మవరంలో కూటమి గెలుపు కోసం టిడిపి కార్యకర్తలు చేసిన కష్టాన్ని ఎవరూ మరువలేరన్నారు. శ్రీరామ్ ఆధ్వర్యంలో ఇక్కడ పార్టీ మరింత బలంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, సందా రాఘవ, విజయచౌదరి, సంకారపు జయశ్రీ, జింకా పురుషోత్తం, పురుషోత్తంగౌడ్, చిగిచెర్ల ఓబిరెడ్డి, మద్దిలేటి, బీమినేని ప్రసాద్‌నాయుడు, జింకా రాజన్న, వేణుగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, సూరి, మనోహర్, రమేష్‌బాబు పాల్గొన్నారు.



మినీ మహానాడులో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 16 మందికి రూ. 14.58 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను శ్రీరామ్ అందజేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ పేదలు వైద్య కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి సిఎం చంద్రబాబు సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికుల దీక్షలు విరమణ

ప్రజాశక్తి-గాండ్లపెంట

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ స్వచ్ఛభారత్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బస్ స్టాప్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్షలో భాగంగా శుక్రవారం కార్మికులు శిబిరంలో మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షలకు సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, రైతు సంఘం నాయకులు కెకె.రాజారెడ్డి, ఖాదర్‌బాషా సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ దాదాపు 30 నెలల నుంచి వేతనాలు అందక స్వచ్ఛభారత్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల వేతనాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఈవోఆర్‌డి అనిత, పంచాయతీ కార్యదర్శులు ఎస్.బాషా, శ్యామ్‌కుమార్ దీక్షా శిబిరం వద్దకు చేరుకొని గ్రాంట్ విడుదలైన వెంటనే బకాయి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వారు దీక్షలను విరమించారు. శిబిరంలో పారిశుధ్య కార్మికుల యూనియన్ అధ్యక్షుడు అక్కులప్ప, కదిరప్ప, అంజి, బాలకృష్ణ, అనిల్, దొడ్డప్ప, 20 మంది కార్మికులు పాల్గొన్నారు



దీక్షా శిబిరంలో కార్మికులతో మాట్లాడుతున్న ఈవోఆర్‌డి

నాణ్యమైన విత్తనాలు అందించాలి : జెడిఎ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు ఆదేశించారు. ఆయన శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు సనావుల్లా, ఎపి సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య, మండల వ్యవసాయ అధికారి ముస్తఫాతో కలిసి పట్టణంలోని విజేత అగ్రిటెక్, శ్రీసాయి సీడ్స్ వేరుశనగ విత్తన ప్రాసింగ్ సెంటర్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని ఏజెన్సీ వారిని కోరారు. తప్పనిసరిగా మొలక శాతాన్ని పరిశీలించిన తర్వాతనే విత్తనాలు పంపిణీ చేయాలని సూచించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు నిల్వ ఉంచాలని ఎపి సీడ్స్ డిఎంను కోరారు. అనంతరం విత్తన సంచుల తూకాలు, సెల్లింగ్ పర్సంటేజ్, తేమ శాతాన్ని పరిశీలించారు. వారి వెంట ఎఇఒ అశ్విని, ఎపి సీడ్స్ సిబ్బంది వినయ్, ప్రాసింగ్ ప్లాంట్ యజమానులు ఉన్నారు.


విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న జెడిఎ సుబ్బారావు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ సేవలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఉచిత ఆన్‌లైన్ సహకార కేంద్రం ఏర్పాటు చేసినట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బదిలీలకు సంబంధించి సమస్యల పరిష్కారానికి, ఆన్‌లైన్‌లో అప్లికేషన్ సబ్‌మిట్ చేసేందుకు, తదితర సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రామకృష్ణ నాయక్, లతాదేవి, రాష్ట్ర కౌన్సిలర్ మేరీ వరకుమారి, డివిజన్ నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, జింకా హరికృష్ణ, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, బిల్లే రామాంజనేయులు, రామాంజనేయులు, వెంకట కిషోర్, ఆంజనేయులు, కుళ్లాయప్ప, ఆదిశేషు, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని ఎన్‌జిఒ భవనంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఉపాధ్యాయుల బదిలీలు, ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా కేంద్రం ప్రారంభించినట్లు జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు చెన్నూరు తాహెర్‌వలి, వైవి.సుబ్బారెడ్డి, నాయకులు మల్లికార్జున, ఆజంబాషా, సంతోష్‌కుమార్ తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఖాజామొహిద్దీన్, వెంకటసుబ్బయ్య, రమణనాయక్, భార్గవ్, ఇర్ఫాన్‌బాషా, బ్రహ్మేంద్ర, లక్ష్మీప్రసాద్, సాధక్, ఖాజా, ముబారక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

యోగా అలవాటు చేసుకుంటే మన వెంట మంచి ఆరోగ్యం ఉన్నట్లేనని ఆర్‌డిఒ వివిఎస్ శర్మ తెలిపారు. యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని బాలికల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆర్‌డిఒ అధ్యక్షతన యోగా ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకులు నారాయణమూర్తి, శంకర్‌బాబు యోగాసనాలు వేయించారు. 15 రోజుల పాటు జరిగే యోగా శిక్షణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పోలప్ప, ఎంఇఒ ఓబుల్‌రెడ్డి, ప్రభుత్వాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


యోగాసనాలు వేస్తున్న ఆర్‌డిఒ, అధికారులు, ఉద్యోగులు

ఎన్‌ఎంయుఎ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం నాయకులు తెలిపారు. డిపో ఆవరణలో శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. యూనియన్ రీజినల్ నాయకులు ఎస్ఎం.సాబ్, మోహన్, డిపో ఛైర్మన్ హనుమాన్, అధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి మధు మాట్లాడుతూ 01/2019 సర్క్యులర్‌పై పలు పోరాటాలు చేసి విజయం సాధించామని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా పోరాడామన్నారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డిపో నాయకులు శంకరయ్య, వైవిఆర్ రెడ్డి, గోపాల్, నారాయణస్వామి, నాయక్, ఉద్యోగులు పాల్గొన్నారు.


01/2019 సర్క్యులర్‌పై విజయం సాధించామని చూపుతున్న పత్రం

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

ప్రజాశక్తి-పావగడ

క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజం అని మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తెలిపారు. తాలూకాలోని దేవలకెరె గ్రామంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యం సాధించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయి క్రీడా పోటీలకు ప్రభుత్వం అధిక నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి డి.మంజునాథ్, కార్యదర్శి పరమేశ్వర్, వ్యవసాయ సేవల సహకార సంఘం డైరెక్టర్ లోకేష్, చంద్రన్న, ఆదిలక్ష్మీ, నరసింహనాయక్, శ్రీనివాస్‌నాయక్, మహేష్‌గౌడ, హొన్నూరప్ప, అనంతయ్య, మంజునాథ్, పాల్గొన్నారు.



బొలెరోలో ఎక్కువ మంది కూలీలను తరలిస్తుండగా ఆపిన పోలీసులు

వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక దొరిగల్లు రోడ్డులో శుక్రవారం అర్బన్ సిఐ శివరాముడు, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ బొలెరో వాహనంలో పరిమితికి మించి మహిళా కూలీలని తీసుకెళ్తుండగా సిఐ ఆ వాహనాన్ని ఆపి డ్రైవర్, కూలీలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సిఐ మాట్లాడుతూ వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఇలా ప్రయాణం చేయకూడదని కూలీలకు సూచించారు. అనంతరం వాహనానికి జరిమానా విధించారు. ఇకపై వాహనంలో అధిక కూలీలను ఎక్కించి ప్రయాణం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సచివాలయాల తనిఖీ


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటలక్ష్మి

సోమందేపల్లి : మండలంలోని చల్లపల్లి, మాగేచెరువు సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో వెంకటలక్ష్మి సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని, విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

వారపు సంత వేలం

రొద్దం : స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, విస్తరణ అధికారి ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతకు బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో రొద్దంకు చెందిన బి.మారెన్న రూ. 1,01,100కు పాట పాడి వారపు సంత హక్కులను దక్కించుకున్నట్లు ఈవోఆర్‌డి గోవిందప్ప తెలపారు. వేలంలో పాల్గొన్న వారు రూ. 20 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొన్నారు.


వారపు సంత వేలం నిర్వహిస్తున్న అధికారులు


మినీ మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న పల్లె రఘునాథ్‌రెడ్డి, అంజినప్ప

నేడు టిడిపి జిల్లా మహానాడు : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు

స్థానిక మామిళ్లకుంట క్రాస్ వద్ద శనివారం నిర్వహించే జిల్లా స్థాయి టిడిపి మినీ మహానాడు ఏర్పాట్లను శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప పరిశీలించారు. వారు సభా ప్రాంగణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చే అవకాశం ఉన్నందున భోజనం, ఇతర సదుపాయాల్లో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని పల్లె సూచించారు. జిల్లా మినీ మహానాడులో టిడిపి ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. వారి వెంట పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్లు బోయ రామాంజనేయులు, విజయ్‌కుమార్, సుబ్బిస్వామి, నాయకులు చంద్రశేఖర్, రామా రావు, లక్ష్మీపతి, గాయత్రి, పిసి గంగన్న ఉన్నారు.

వైసిపి మండల వైస్ ప్రెసిడెంట్‌గా తిరుపాల్‌నాయక్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్


తిరుపాల్‌నాయక్

మండలంలోని పెడపల్లి గ్రామానికి చెందిన తిరుపాల్‌నాయక్‌ను వైసిపి మండల వైస్ ప్రెసి డెంట్‌గా నియమించారు. తిరుపాల్‌నాయక్ గతంలో వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. అప్పుడు గిరిజన సంక్షేమం, వారి సమస్యలపై తన వాణి వినిపించారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని అప్పజెప్పిన పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, జిల్లా, మండల నాయ కులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటానని తెలిపారు.



రోగులకు భోజనం ప్యాకెట్లు అందజేసిన శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు

రోగులకు సేవ చేయడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రోగులకు సేవ చేయడంలో సంతృప్తి, సంతోషం లభిస్తాయని శ్రీసత్యసాయి సేవా సమితి కన్వీనర్ నామా ప్రసాద్ తెలిపారు. వారు శుక్రవారం ప్రభుత్వాసుపత్రిలోని 380 మంది రోగులు, వారి సహాయకులకు వైద్యులు, నర్సుల చేత భోజనం ప్యాకెట్లు, గర్భిణులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రసాద్ మాట్లాడుతూ ఉరుకుండ్ల రంగనాథం, వారి కుటుంబ సభ్యుల సహకారంతో వీటిని పంపిణీ చేశామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ శ్రీసత్యసాయి సేవా సమితి సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉంటూ, మానవతా విలువలు పెంపొందించేలా జీవితాన్ని మలుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి మైనార్టీ సెల్ మండల కన్వీనర్‌గా బాబ్‌జాన్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు



వైసిపి మండల మైనార్టీ సెల్ కన్వీనర్‌గా బాబ్‌జాన్ ఎంపికయ్యారు. తనను ఎంపిక చేసినందుకు పార్టీ అధినేత జగన్, పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సహకరించిన నాయకులకు బాబ్‌జాన్ కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని శివానగర్‌కు చెందిన గోపాల్ భార్య లలిత(56) శుక్రవారం ఆత్మహత్యకు పాల్ప డింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. లలిత కూలి మగ్గం నేసేవారు. కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్థాపానికి గురై ధర్మవరం చెరువు రెండో మరువ వద్ద చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫొటోలు మార్ఫింగ్ చేశారని భర్తపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

తన ఫొటోలు మార్ఫింగ్ చేశారని తోట శిరీష అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మీనారాయణ, యాషిక, జగదీష్, శివపై కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలు.. శిరీష కొన్ని కారణాల వల్ల భర్తతో విడిపోయి పుట్టింటిలో ఉంది. అయితే భర్త లక్ష్మీనారాయణ, యాషిక ఇతరుల సాయంతో తన ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి రూ. 3 లక్షలు డిమాండ్ చేశారని బాధితురాలు ఫిర్యాదులో తెలిపింది. శిరీష ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

బాలిక కనపడడం లేదని ఫిర్యాదు


తప్పిపోయిన మూగ బాలిక రెడ్డిరాణి

తలుపుల : స్థానిక ఎస్టీ కాలనీకి చెందిన గోర్ల సుధ, సిద్దు దంపతుల కూతురు పదేళ్ల రెడ్డి రాణి(మూగ)కి మాటలు రావు. శుక్రవారం ఇంటి వద్ద ఆడుకుంటూ ఉన్నఫళంగా కనపడకుండా పోయింది. దీంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నరసింహుడు సిబ్బందితో కలిసి ఆ గ్రామం చేరకుని బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక సమాచారం తెలిస్తే ఎస్ఐ 9490113581కు తెలపాలని కోరారు.